TELANGANA
RESOURCE CENTRE
"CHANDRAM" 490, St.No.11, Himayatnagar, Hyderabad-29 Mobile: 9030626288
E-mail: trchyd@gmail.com Website: www.trchyd.org

# ఉద్యమ చైతన్యాన్ని కొనసాగించాలి

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమం ప్రజలను చైతన్యవంతులను చేసిందని, రాష్ట్రం ఏర్పడిన తరువాత కూడా ఇదే విధమైన చైతన్యాన్ని, ఉద్యమాన్ని కొనసాగించాల్సిన అవసరం ఉందని వక్తలు అన్నారు. తెలంగాణ రిసోర్స్ సెంటర్ శనివారం నాడిక్కడ హిమాయత్‌నగర్‌లోని 'చంద్రం'లో 119వ చర్చా కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి అధ్యక్షత వహించారు. ప్రొఫెసర్ ఐ.తిరుమలి, 'నడుస్తున్న తెలంగాణ' సంపాదకులు డాక్టర్ కాశీం, క్యాంపస్ వాయిస్ సంపాదకులు దేవిడ్ వక్తలుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, ఉద్యమం ఆగితే మళ్ళీ నాయకత్వం పక్కదోవ పట్టే అవకాశం ఉందన్నారు. ఈ ఎన్నికల సందర్భంగా విడుదల చేసిన మేనిఫెస్టోలను చూస్తే అవి పూర్తిగా ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా ఉన్నాయన్నారు. ప్రజల ఆకాంక్షలు ఎలా ఉండాలో తెలుసుకోవాలంటే, యాకూబ్ రెడ్డిని అడగాలే, అమరుల తల్లిదండ్రులను అడగాలే, ఆత్మహత్య చేసుకున్న రైతు భార్యను అడగాలె...వాళ్ళు ప్రజా ఆకాంక్షలను చెబుతారు...అని అన్నారు. ఏసీ గదుల్లో కూర్చొని రాస్తే అది ప్రజల మేనిఫెస్టో కాదన్నారు. ఇంత ఉద్యమం జరిగిన తరువాత ఒక్కరైనా సింగరేణి కార్మికుని గురించి, ఓపెన్‌కాస్ట్ విధ్వంసం గురించి మాట్లాడుతున్నారా అని ప్రశ్నించారు. గుట్టల విధ్వంసం గురించి, పోలవరం నిర్వాసితుల గురించి, చెరువుల విధ్వంసం గురించి మాట్లాడుతున్నారా అని నిలదీశారు. తెలంగాణలో మూతపడిన పరిశ్రమల గురించి ఒక్క మేనిఫెస్టో కూడా ప్రస్తావించడం లేదని విమర్శించారు. నేడు రాహుల్ గాంధీ మేడిన్ తెలంగాణ గడియారం కావాలని అడుగుతున్నారని, ఈ హైదరాబాద్‌లోనే ఆల్విన్, హెచ్ఎంటీ పరిశ్రమలు ఉండేవని, వాటిని సమైక్యవాద పార్టీలు మూసివేయించాయని, ఆ విషయం ఆయనకు తెలుసా అని ప్రశ్నించారు. తెలంగాణను దోపిడీ చేసిన సీమాంధ్ర నాయకులకు సద్దులు మోసిన నాయకులు నేడు జై తెలంగాణ అనగానే లేదా పార్టీ మారగానే తెలంగాణ ప్రజలు క్షమించారని పేర్కొన్నారు. ఈ రోజులన కాంట్రాక్టర్లు, వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు సీట్లు కొనుక్కొని నిలబడ్డారని, వారు ప్రజల ఆకాంక్షలు తెలుసుకునేది ప్రశ్నార్థకమేనన్నారు.

చదువుకున్న వారికి ఉద్యోగావకాశాలు, సాగునీరు, తాగునీరు, ఉపాధి, ఆత్మగౌరవం...ఇవే తెలంగాణ ప్రజల ఆకాంక్షలని, రాజ్యాంగం ప్రకారం కూడా వీటిని ప్రభుత్వాలు ప్రజలకు కల్పించాలని వక్తలు పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలకు రాజ్యాధికారం లేదని, ఉన్న కొద్దిమంది సీమాంధ్ర నాయకుల తొత్తులే కాబట్టి ఇక్కడ ప్రజలకు అన్యాయం జరిగిందని వ్యాఖ్యానించారు. ఉద్యమాన్ని మొదటి నుంచి కూడా ప్రజలే నడిపించారు కాబట్టి ప్రజల ఆకాంక్షలను తెరపైకి తీసుకురావాలని సూచించారు. వాటి విషయంలో నేతలు ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. రిజర్వేషన్లు, ఇతర అంశాల్లో ఇదే వైఖరి అనుసరిస్తున్నారని పేర్కొన్నారు. నాయకులు ప్రజలను పట్టించుకోకపోతే మేధావులు, విద్యార్థులతో పాటు ప్రజాసంఘాలు ఊరుకోవని, మళ్లీ ఉద్యమాలు వస్తాయని పేర్కొన్నారు. అప్పుడు ఈ మేనిఫెస్టోలు ప్రభుత్వాలకు ఉరితాళ్ళుగా మారుతాయని అన్నారు.

సోమేష్
టీఆర్‌సీ